

వృద్ధ దంపతుల ఆత్మహత్య
పెన్నా నదిలో దూకి వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య, నాంచారమ్మ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. -8లో



కమీషన్ల కోసమే ప్రైవేటుకు వైద్య కళాశాలలు
రాష్ట్రంలో వైద్య కళాశాలలను కమీషన్ల కోసమే ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించేందుకు సిద్ధమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ ఆరోపించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.130	రూ.150
రెండోరకం	రూ.90	రూ.120

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 140 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రికార్డు ధర పలికిన గణేష్ లడ్డూ



లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసులరెడ్డి

రాయచోటి టౌన్: రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రికార్డు ధర పలికింది. గురువారం రాత్రి వేలం పాట నిర్వహించగా రాయచోటి పట్టణానికి చెందిన మడితాటి శ్రీనివాస రెడ్డి (కోడి శ్రీను) రూ.12లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించి లడ్డూను అందజేశారు.

వైభవం.. పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న శ్రీదేవి,భూదేవి సమేత వెంకన్న

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్,రమేష్‌లు మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర వితరణ, చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీవారిని పవిత్ర హారాలతో అలంకరించి పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, ఆర్‌ఎంపి డాక్టర్ రమణారెడ్డి, సిద్దారెడ్డి ,బొట్టు శంకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు చతుష్టార్చన, ద్వారతోరణ, అనంత కళాపూజ, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 4.00 నుంచి 6.00 గంటల వరకు నిత్య హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్, ఇతర అర్చకులతోపాటు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం.. ప్రైవేట్‌కు నైవేద్యం

నిరుపేదలకు ఖరీదైన వైద్యం అందకుండా కూటమి ప్రభుత్వం మరణ శాసనం లిఖిస్తోంది. మదనపల్లె కేంద్రంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య కళాశాల మంజూరు చేసి తద్వారా నిరుపేదలకు ఉచితంగా ఖరీదైన వైద్యం అందిస్తూ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే వైద్య కళాశాలపై శీతకన్ను వేసిన కూటమి ప్రభుత్వం ఏకంగా పీపీపీ కింద ప్రైవేట్‌కు అప్పగించేందుకు నిర్ణయించింది. పేదలకు ఖరీదైన, నాణ్యమైన వైద్యానికి దూరం చేసే చర్యలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

- మదనపల్లె ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ కింద ప్రైవేట్‌కు ఇచ్చేందుకు ప్రభుత్వ నిర్ణయం
- పేదలకు నాణ్యమైన వైద్యం అందకుండా చేసేలా చర్యలు
- 2023లో మదనపల్లె వైద్య కళాశాల నిర్మాణానికి 475 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఏడాదిలోనే రూ.80 కోట్ల పనులు పూర్తి
- కూటమి ప్రభుత్వం రాకతో ఆగిపోయిన పనులు



పనులు పూర్తికావొస్తుండగా ఆగిపోయిన వైద్య కళాశాల ప్రధాన భవనం



మదనపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ఒకేసారి మంజూరు చేసి చరిత్ర సృష్టించింది. వీటిలో మదనపల్లె ఒకటి. జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గాల పేదలు ఇక్కడ కార్పొరేట్ వైద్యం పొందేవారు. ఈ వైద్య కళాశాలను నాలుగు వరసల జాతీయ రహదారిపై ఆరోగ్యం (శానిటోరియం) వద్ద 95.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులను వర్చువల్‌గా అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలను నిర్మించాలి. ఈ పనులకు 2023 ఫిబ్రవరిలో ఒప్పందం జరగ్గా..2025 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలన్నది కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం గడువు విధించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి 17 శాతం పూర్తి చేసి రూ.80 కోట్ల విలువైన పనులు చేశారు. ఇందులో ప్రధాన కళాశాల భవనం, రెండు హస్టల్ భవనాల పనులు 70 శాతం పూర్తి చేశారు.


ఎక్కడి పనులు అక్కడే

కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కళాశాలపై నీలినీడలు అలుముకున్నాయి. వీటి పనులను పూర్తి చేయించకుండా నిర్లక్ష్యం చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టు సంస్థ సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం అనాసక్తి చూపింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. 70 శాతానికిపైగా పూర్తయిన భవనాలు, పిల్లర్ల దశలోని భవనాలు, పునాదులకే పరిమితమైన భవనాల పనులు, కళాశాల స్వాగత ద్వారం పనులు ఎక్కడివి అక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో 2023 ఫిబ్రవరి నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నెలకు ముందు వరకు నిత్యం పనులతో కళకళలాడిన కళాశాల ప్రాంగణం నిశ్శబ్దంగా మారిపోయింది. నిర్మాణం కోసం సిద్ధంగా ఉంచిన సామగ్రిని నిర్మాణ సంస్థ సిబ్బంది ఇక్కడి నుంచి తరలించేస్తున్నారు. ప్రస్తుతం కొద్దిపాటి సామాగ్రి మాత్రమే మిగిలి ఉండగా వాటిని తరలిస్తున్నారు. దీనితో కాంట్రాక్టు సంస్థ పూర్తిగా పనులనుంచి తప్పుకున్నట్టే.

మిథున్ కృషి మరువలేనిది

రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఉండాలన్న ఆకాంక్షతో ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి చేసిన కృషిని ఈ ప్రాంత ప్రజలు మరువలేరు. వైద్యపరంగా అభివృద్ధి లేని, వైద్య సేవలు మెరుగుపర్చాల్సిన వెనుకబడి మదనపల్లె ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరులో మిథున్‌రెడ్డిది విశేషమైన కృషి. పేదలకు ఖరీదైన ఖర్చుతో కూడిన వైద్య సేవలు, చికిత్సలు ఉచితంగా అందుబాటులోకి తేవడం కోసం మెడికల్ కళాశాలను ఆయన మంజూరు చేయించారు.

ఖరీదైన వైద్యం దూరం చేస్తూ...



ప్రభుత్వ ఆధ్వర్యంలో మదనపల్లె వైద్యకళాశాలను నిర్వహించి ఉంటే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల నిరుపేదలకు ఎంతో ప్రయోజనం కలిగేది. ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందేవారు. ప్రభుత్వ కళాశాలగా కొనసాగిస్తే..వంద జనరల్ మెడిసిన్ పడకలు, వంద జనరల్ సర్జరీ పడకలు, 60 పడకలు చిన్న పిల్లలకు, 50 పడకలు ఆర్థో విభాగానికి, పది పడకలు కంటి విభాగానికి, పది పడకలు టీబీ విభాగానికి, పది పడకలు మానసిక వ్యాధిగ్రస్తులకు. ఇలా అన్ని విభాగాలకు సంబంధించి 620 పడకలు అందుబాటులోకి వచ్చేవి. అలాగే ఉచితంగా ఖరీదైన వైద్యాన్ని పేదలు పొందే అవకాశం ఉండేది. ఇప్పుడు ఈ కళాశాలను పీపీపీ కింద ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పేదలకు వైద్యం ఖరీదుగా మారిపోనుంది.

జరగాల్సిన నిర్మాణాలు



అసంపూర్తిగా ఆగిపోయిన బాలుర హస్టల్

మెడికల్ కళాశాల ప్రధాన భవనం, టీచింగ్ హాస్పిటల్, విద్యార్థులకు వసతి గృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెంట్స్‌కు భవనాలు, నర్సింగ్ కళాశాల, విద్యార్థినులకు వసతి భవనం, పనిచేసే నర్సింగ్ సిబ్బందికి నివాస భవనాలు, మెడికల్ వ్యర్థాల నిర్వహణ, వంటగది, డైనింగ్ హాలు, డ్రగ్‌స్టోర్, మార్చురీ గది, ల్విక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, విద్యార్థులకు లైబ్రరీ, టీచింగ్ గదులు, ఇంకా వివిధ కార్యక్రమాలకు సంబంధించిన భవనాల నిర్మాణాలు మొత్తం 23 పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో ఇవి పూర్తి దశలో ఉన్నవి.. కళాశాల ప్రధాన భవనం, విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా హస్టల్, ఓపీడీ భవనం నిర్మాణాలను 70శాతానికి పైగా పూర్తి చేశారు. కిచెన్, డైనింగ్,సెంట్రల్ లైబ్రరీ, ఇతరా భవనాల నిర్మాణాలు భూమిలోపలి పనులు పూర్తి చేసి పిల్లర్ల పనులు పూర్తి చేశారు. కాంట్రాక్టు సంస్థ 2023 ఆగస్టులో పనులకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. 2025 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం.

100 సీట్లు కోల్పోయాం

కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలపై నిర్లక్ష్యం చూపడంతో 2024–25 ఏడాదికి మంజూరవ్వాల్సిన 100వైద్య విద్య సీట్లను కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది. కళాశాల నిర్వహణ లేక, అనుమతులు పొందకపోవడంతో మదనపల్లె మెడికల్ కళాశాలను నిర్వీర్యం చేశారు. పనుల విషయంలోనూ ప్రభుత్వం నిధులు ఇవ్వక, కాంట్రాక్టు సంస్థపై పనులు పూర్తి చేయాలన్న ఒత్తిడి చేయకపోగా పనులు ఆపేలా సంకేతాలు ఇవ్వడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయాయి.

కక్షసాధింపులో భాగంగానే మెడికల్ కాలేజీ ప్రైవేట్‌పరం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మెడికల్ కాలేజీలను కక్షసాధింపులో భాగంగానే కూటమిప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తోందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై శుక్రవారం మండలంలోని ఆరోగ్యవరం వద్ద 95 ఎకరాల స్థలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మాణం తలపెట్టి, దాదాపు 80శాతానికి పైగా పనులు పూర్తయిన మెడికల్ కాలేజీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రాజంపేట పార్లమెంటరీ పరిధిలో మంజూరైన మెడికల్ కాలేజీని పడమటి నియోజకవర్గాల ప్రజల వైద్యసేవల కోసం మదనపల్లెలో ఏర్పాటుచేసేలా చేయడంలో ఎంపీ మిథున్‌రెడ్డి కీలకపాత్ర పోషించారన్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు అత్యవసర వైద్యసేవలకు 100కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి తిరుపతికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండటంతో స్థానికంగా మెడికల్ కాలేజీ ఏర్పాటుచేస్తే సౌకర్యంగా ఉంటుందని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించి ఎంపీ మిథున్‌రెడ్డి మదనపల్లెకు కేటాయించారన్నారు. రూ.475 కోట్లతో పనులు ప్రారంభించి దాదాపు 80శాతానికి పైగా పనులు పూర్తయిన తరుణంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి రావడం, కక్షసాధింపుల్లో భాగంగా పనులు నిలిపివేయడం జరిగిందన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ, ప్రజాసంఘాల నాయకులు ఉద్యమిస్తే...స్థానిక టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మెడికల్ కాలేజీ ఎట్టి పరిస్థితుల్లోనూ పీపీపీ విధానంలోకి వెళ్లదని, ఒకవేళ వెళితే...రోడ్డుమీదకు వచ్చి ఉద్యమిస్తానని హామీ ఇచ్చారన్నారు. హామీ నిలుపుకోవాలని కోరారు. మదనపల్లె మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రజాసంఘాలు, వామపక్షనాయకులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించుకుని కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మెడికల్ కాలేజీని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనిచ్చేది లేదని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించేలా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, వెలుగుచంద్ర, పోతబోలు నాగరాజ, బొమ్మిశెట్టిమధు, కొత్తపల్లె మహేష్, సీపీఎం మురళీ, ఏఐఎస్‌ఎఫ్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె మెడికల్ కాలేజీ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్

మదనపల్లెలో రంగమ్మత్త సందడి

మదనపల్లె రూరల్: రంగస్థలం సినిమాలో రంగమ్మత్తగా మెప్పించిన ప్రముఖ సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ శుక్రవారం మదనపల్లెలో సందడి చేశారు. పట్టణంలోని కదిరిరోడ్డు జడ్జిబంగళా పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన సితార షాపింగ్ మాల్‌ను అభిమానుల కోలాహలం నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వైవిధ్యభరితమైన డిజైన్లతో సంప్రదాయం, ఆధునికత కలబోసిన సితార షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఈ షాపింగ్ మాల్ ప్రజల ఆదరాభిమానాలు పొంది మదనపల్లెలో ప్రథమస్థానంలో నిలవాలన్నారు. షాపింగ్‌మాల్ అధినేతలు.. నాగమల్లికార్జున, కే.ఆనంద్‌కుమార్, కే.సాయికిరణ్, .బి.శివకుమార్ మాట్లాడుతూ... ఫ్యాషన్ హల్‌చల్..సితారకి చల్ చల్ అనేలా పట్టణ ప్రజలందరి అభిరుచులకు తగిన విధంగా షాపింగ్ మాల్‌ను ఏర్పాటుచేశామన్నారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ అనంతరం అనసూయ డ్యాన్స్ చేసి అభిమానులను ఉర్రూతలూగించారు. ప్రారంభోత్సవం సందర్భంగా షాపింగ్ మాల్‌ను సందర్శించిన వారిలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేతవిభాగం జిల్లా అధ్యక్షులు శీలంరమేష్, మునిశేఖర్, నాయకులు రాటకొండ బాబురెడ్డి, శ్రీరామ్ చినబాబు, జంగాల శివరాం, రాజ్‌భవన్ రాజా తదితరులు పాల్గొన్నారు.



సితార షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ భరద్వాజ్

కుప్పం వద్దు.. ఇక్కడే ఉందాం!

- హంద్రీ–నీవా డివిజన్ తరలింపుపై మల్లగుల్లాలు

మదనపల్లె: హంద్రీ–నీవా కుప్పం డివిజన్–12 కార్యాలయాన్ని మదనపల్లె ఎస్‌ఈ కార్యాలయం నుంచి కుప్పం తరలించి అక్కడికి వెళ్లి విధుల నిర్వహించేందుకు అధికారులు విముఖత చూపుతున్నారు. 2018లో మంజూరైన డివిజన్ కార్యాలయాన్ని కుప్పంలో ఏర్పాటు చేయకుండా మదనపల్లె ఎస్‌ఈ కార్యాలయంలోనే నిర్వహిస్తూ వస్తున్నారు. దీనిపై జూలై 31న సాక్షిలో 'కదలరు..వదలరు'శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. ఇన్నేళ్లుగా వెలుగులోకి రాకుండా సాగిపోతున్న వ్యవహారం బహిర్గతం కావడంతో అప్పటినుంచి కుప్పంకు వెళ్లకుండా ఏం చేయాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతూ వస్తున్నారు. నెలరోజుల్లో పలు ఆసక్తికర విషయాలు చోటుచేసుకొంటున్నాయి. కుప్పం డివిజన్–12 ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుపై మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేయడం, మెమోల జారీకి ఆదేశించడం, తిరుపతి సీఈ చర్యలు తీసుకోవడం జరిగిపోయింది. ఈ నేపథ్యంలో మంత్రి దృష్టికి ప్రాజెక్టు అధికారులు కుప్పం నుంచి విధులు నిర్వహించడం లేదని రావడంతో కుప్పం ఈఈ మదనపల్లె సర్కిల్ కార్యాలయం నుంచి విధులు నిర్వహించేందుకు అంగీకరించడం లేదని తెలిసింది. పనిచేస్తున్న ఉద్యోగులు కుప్పం రావాలని మౌఖికంగా ఆదేశాలు ఇచ్చారు. దీంతోపాటు కార్యాలయ గదులకు తాళాలు కూడా వేసేశారు. అయినప్పటికీ కుప్పం వెళ్లేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడంతో రాజకీయంగా ఒత్తిడి తీసుకొచ్చి సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పంకు వెళ్లి విధులు నిర్వహించలేమని చెప్పి..మదనపల్లె నుంచి విధులు నిర్వహించేలా రాజకీయ నేతల ద్వారా ప్రయత్నాలు మొదలైనట్టు తెలిసింది. ఇందులో భాగంగా టీడీపీ నేతల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. డివిజన్ కార్యాలయం మదనపల్లెలోనే కొనసాగించి, సబ్ డివిజన్ పేరుతో ఒక చిన్న గదిలో కార్యాలయం ప్రారంభించి అక్కడ ఎవరినో ఒకరిని పంపి..కార్యాలయం తరలించామని చెప్పుకునేందుకు అవస్థలు పడుతున్నారు. లేనిపక్షంలో పూర్తిస్థాయిలో డివిజన్ కార్యాలయాన్ని తరలించడమే అని మధనపడుతున్నారు.



హంద్రీ–నీవా మదనపల్లె సర్కిల్ కార్యాలయం

- కుప్పం ఉప కాలువకు సంబంధించి జరుగుతున్న కాంక్రీటు లైనింగ్ పనులు పూర్తయిపోయాయి కాబట్టి కుప్పం నుంచి విధులు నిర్వహించాల్సిన అవసరం లేదంటూ కొందరు అధికారులు వింత వాదన లేవనెత్తారు. 2018లో మంజూరైన డివిజన్ కార్యాలయాన్ని ఇప్పటిదాకా కుప్పంలో ఏర్పాటు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఇంకా మీనమేషాలు లెక్కిస్తోంది.

సీఎం అంగీకరిస్తారా

గత టీడీపీ ప్రభుత్వంలో సీఎంగా ఉన్న చంద్రబాబు తన నియోజకవర్గానికి మంజూరు చేసిన డివిజన్ కార్యాలయం మదనపల్లెలోనే కొనసాగేందుకు అంగీకరిస్తారా అన్నదానిపై చర్చించుకొంటున్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ద్వారా సీఎంను సంప్రదించి ఈ విషయమై నిర్ణయం తీసుకోవాలని కోరితే అనుకూలమైన నిర్ణయం వెలువడే అవకాశం ఉండదని చెబుతున్నారు. దీంతో డివిజన్ కార్యాలయాన్ని కుప్పం తరలించడమే బెటర్ అని కొందరు అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలి



మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శశికళ

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- 56 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం

రాయచోటి: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నతులుగా తీర్చిదిద్దాలని రాష్ట్ర రవాణ, క్రీడలు, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అజయ్ రెసిడెన్సీ హాలులో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలు ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులలో ఉన్నత విలువలు, విజ్ఞానం నూరిపోసి భవిష్యత్తు తరాలను సమాజానికి దిశానిర్దేశం చేసేలా తీర్చిదిద్దాలన్నారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌ను రెండు శాతం నుంచి మూడుశాతానికి పెంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో 421 పోస్టులను స్పోర్ట్స్ కోటా క్రింద భర్తీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న బి హరినాథ్



కె జయమ్మ, సంబేపల్లి



రాజశేఖర్, చిట్వేలి



శివ నారాయణ, చిట్వేలి



షఫీవుల్లా, నందలూరు



నాగలక్ష్మి, అంగళ్లు



రమేష్‌కుమార్, లక్కిరెడ్డిపల్లె

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం ప్రతి ఒక్కరికీ ప్రేరణ అవుతుందన్నారు. జిల్లాలో అత్యుత్తమ సేవలు అందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది మంచి పేరు తెచ్చుకున్న 56 మంది గురువులను సన్మానించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గురువుల స్థానం గొప్పదన్నారు. ఉత్తమ పౌరులు తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. అనంతరం అతిథులు 56 మంది ఉపాధ్యాయులను పేరుపేరున ఆత్మీయంగా పలుకరిస్తూ సన్మానం చేశారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ కె సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈఓలు పాల్గొన్నారు.



అన్నమయ్య జిల్లాకు చెందిన నిర్మల కుమారిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల కుమారి, వెంకటేశ్వర ప్రసాద్‌లను పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలు సన్మానించారు. –విజయవాడ



జి వెంకటేశ్వర ప్రసాద్

క్లుప్తంగా

కారుకు నిప్పు



లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలోని పాత మసీదు సమీపంలో మారుతీ కారుకు శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితుడు అన్వర్ బాష తెలిపారు. తన ఇంటి సమీపంలోని చెట్టు కింద కారు కొన్ని సంవత్సరాలుగా పెడుతున్నామన్నారు. శుక్రవారం తెల్లవారుజామున నిద్రపోయే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారుపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టగా కారు కాలుకుంటూ టైరు పగిలి వెంటనే శబ్దం వచ్చిందని, బయటకు వచ్చి చూసేసరికి కారు అప్పటికే దగ్ధమైందని తెలిపారు. కారు సుమారు నాలుగు లక్షల రూపాయలు పైగా విలువ చేస్తుందన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రవీంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

బి.కొత్తకోట : స్థానిక కరెంట్ కాలనీకి చెందిన వృద్ధుడు వలీసాహెబ్ (65) అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వలీసాహెబ్‌కు అప్పుడప్పుడు మతిస్థిమితం ఉండదు. దీనితో ఇంటినుంచి వెళ్లిన తర్వాత ఎక్కడైనా కనిపిస్తే కుటుంబీకులు ఇంటికి తీసుకెళ్తుంటారు. గతనెల 29న ఇంటినుంచి వెళ్లిన వలీసాహెబ్ ఆచూకీ లభ్యంకాక పోవడంతో కుమారుడు నయాజ్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ



దుకాణంలో చోరీకి పాల్పడుతున్న దొంగ

ఖాజీపేట : మండలంలోని ఎస్‌వీబీ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. సుమారు నాలుగు కేసుల మద్యంతోపాటు క్యాష్ కౌంటర్‌లోని కొద్ది మొత్తంలో డబ్బును దొంగలు దోచుకుపోయారు. ఖాజీపేట బ్రిడ్జి అవతల ఉన్న మద్యం దుకాణంకు చెందిన యజమానులు శుక్రవారం ఉదయం దుకాణం తెరిచి చూడగా వెనుక భాగంలోని తలుపు తెరిచి ఉండటం గమనించారు. వెంటనే దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి ముఖానికి మాస్కు ధరించిన దొంగ తలుపు పగులకొట్టి లోనకు ప్రవేశించాడు. దుకాణంలోని నాలుగు కేసుల మద్యంతోపాటు క్యాష్ కౌంటర్‌లోని కొద్ది మొత్తంలో డబ్బు చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలో ఉన్న దృశ్యాలను పరిశీలించిన తరువాత ఖాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు.

దాడిచేసిన నలుగురిపై కేసు

కలకడ : ఇంటిమీదకు వచ్చి దాడిచేసి కొట్టి గాయపరిచిన నలుగురిపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కలకడ పంచాయతీ, కలకడ కొత్తపల్లె గ్రామానికి చెందిన సిద్దయ్య కుమారుడు అమరనాథను, అదే గ్రామానికి చెందిన నితిన్, తరున్, వినోద్, సంతోష్‌లు గురువారం రాత్రి కొట్టి గాయపరిచారు. వారి దాడిలో గాయపడ్డ అమరనాథ్, రాధికలను కలికిరి మండలం, మహల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. శుక్రవారం బాధితుడు అమరనాథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులు నలుగురుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెన్నానదిలో వృద్ధ దంపతులు ఆత్మహత్య

- విస్తృతంగా జాలర్లు గాలింపు
- మాచుపల్లి సమీపాన మృతదేహాలు లభ్యం





మృతులు వెంకటసుబ్బయ్య, నాంచారమ్మ (ఫైల్), పెన్నానది నుంచి మృతదేహాలను బయటకు తెస్తున్న దృశ్యం

సిద్ధవటం : పెన్నా నదిలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకోవడంపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య (84), నాంచారమ్మ (80) దంపతులు బుధవారం తమ ఒంటిపై ఉన్న నగలు, నగదు ఇంటిదగ్గర పెట్టి కనబడకుండా పోవడంతో వారి పెద్ద కుమారుడు మహేష్ చెన్నూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమాంబ అమ్మవారిని దర్శించుకొని కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకొని పెన్నా నదిలో మొదట నాంచార మ్మ దూకగా కేసుపు అటూ ఇటూ ఇతరుగుతూ తడబడి వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి కూడా పెన్నాదిలో దిగాడు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదు కాగా ఒడ్డున నాంచారమ్మ పాదరక్షలు ఉండటంతో బంధువులు గుర్తించారు. మృతి చెందిన వృద్ధ దంపతుల చిన్న కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఐదుగురు జాలర్ల సహాయంతో పెన్నా నదిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మాచుపల్లి గ్రామ సమీప ప్రాంతాలలోని ముళ్లపొదల్లో మృతదేహాలు ఉన్నట్లు జాలర్లు గుర్తించి పెన్నా నదిఒడ్డున చేర్చారు. మృతి చెందిన వృద్ధులుగతకొన్ని రోజులుగా దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతూ అవస్థలు పడేవారు. పలుమార్లు వైద్యశాలలో చికిత్స కూడా చేయించామని వారి బంధువులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం మాచుపల్లి పెన్నా నది ఒడ్డున రిమ్స్ వైద్యుడు శవ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

నెల్లూరు జట్టు ఘన విజయం



నారాయణ, నెల్లూరు (3 వికెట్లు)



అఖిల్, నెల్లూరు (3 వికెట్లు)



శివ కేశవ, కడప (66 పరుగులు)



ఆదిల్ హుస్సేన్, కడప (58 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–23 మల్టీ మ్యాచ్‌లు శుక్రవారం మూడవ రోజు అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 14 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని భార్గవ్ రాజు 45 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 44 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నారాయణ 3 వికెట్లు, అఖిల్ 3 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 160 అధిక్యంతో విజయం సాధించింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 239 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 350 పరుగులు చేసింది. అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 187 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

డ్రాగా ముగిసిన కడప–కర్నూలు మ్యాచ్

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కడప–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 80 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 297 పరుగులు చేసింది. ఆ జట్టులోని శివ కేశవ 66 పరుగులు, ఆదిల్ హుస్సేన్ 58 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని సాయి సూర్యతేజ రెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 4 ఓవర్లకు 40 పరుగులు చేసింది. దీంతో కడప–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 297 పరుగులు చేసింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 314 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 40 పరుగులు మాత్రమే చేసింది. ఈ మ్యాచ్‌లో కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో అధిక్యంతో ఉండటంతో 03 పాయింట్లు లభించాయి.

టపాసులు పేలి గాయపడిన వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారి మఠం మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ బాగాదుపల్లెలో గత శుక్రవారం వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ఊరేగింపులో ప్రమాదవశాత్తు టపాసులు పేలి కుమ్మితి పాలకొండయ్య (35)కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. అయితే మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా గత వారం రోజులు గా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. తమను ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి భార్య పిల్లలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మతిస్థిమితం లేని మహిళ భర్తకు అప్పగింత



మతిస్థిమితం లేని మహిళను ఆమె భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామంలో గురువారం రాత్రి మతిస్థిమితం లేని మహిళ తిరుగుతుండగా స్థానికులు గుర్తించి 112కు సమాచారమిచ్చారు. దీంతో నైట్‌డ్యూటీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను విచారించగా తన పేరు ఉప్పరపురమాదేవి అని, చాపాడు మండలం ఎస్.ఓబాయపల్లె గ్రామానికి చెందినదిగా పోలీసులకు తెలిపింది. వెంటనే పోలీసులు ఆమె భర్త యేసోబుకు సమాచారం అందించి స్టేషన్‌కు పిలిపించి రమాదేవిని ఆమె భర్తకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీరంగనాథుని కల్యాణం





రంగనాథస్వామిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- ముగిసిన శ్రీరంగనాథస్వామి నూలు పూజ పవిత్రోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారి నూలు పూజా పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లె కృష్ణరాజేష్ శర్మ నేతృత్వంలో భక్తులు చల్లా వంశీయుల సహకారంతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ భక్త జనసందోహంతో వేద మంత్రోచ్చారణలతో కమనీయంగా స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అంకాలమ్మ దేవస్థాన చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, పెద్దిరాజు, తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ చైర్మన్ సుధీర్ రెడ్డి ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కళ్యాణ అనంతరం చల్లా వంశీయుల సౌజన్యంతో వేలమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం శ్రీరంగనాథ స్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో శ్రీరంగనాథస్వామి నూలుపూజ పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వి.రమణ, ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, శ్రీరంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు, వాసవీ ఆలయ ప్రధాన అర్చకులు సాయి భరద్వాజ శర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు కాంభోజి మల్లికార్జున, దశరథ రామిరెడ్డి, మాధవాచారి, మేడం దినేష్ కుమార్, ఆలయ సిబ్బంది,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో మురికినాటి రాజారెడ్డి (75) అనే వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ కుళాయప్ప కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం చెన్నముక్కపల్లె నుంచి తన పొలానికి స్కూటీపై రాజారెడ్డి వెళ్తుండగా కడప వైపు నుంచి మదనపల్లె రోడ్డు వైపు వస్తున్న ఏపీ39 యుఎస్ 9908 నంబర్ గల కారు ఢీకొంది. రాజారెడ్డి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు గంగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కమీషన్ల కోసమే

ప్రైవేటుకు వైద్య కళాశాలలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతం కుమార్



మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

మదనపల్లె : రాష్ట్రంలో వైద్య కళాశాలలను కమీషన్ల కోసమే ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేట్‌కు అప్పగించేందుకు సిద్ధమైందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం మదనపల్లె పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. 63 ఏళ్ల లీజుకు అప్పగించడం వెనుక వందల కోట్లను కమీషన్ల రూపంలో దోచుకునేందుకు ఈ విధానం తెస్తున్నారని ఆరోపించారు.ప్రైవేట్‌కు అప్పగించడం ద్వారా రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల పేద విద్యార్థులు రిజర్వేషన్ కోల్పోయి వైద్య విద్యకు దూరమై తీవ్రంగా నష్టపోతారని అన్నారు. పేదప్రజల ఆస్తిగా భావించే వైద్య కళాశాలలను ప్రయివేటు పేరుతో ఓ వర్గానికి ఆస్తులను కట్టబెట్టి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. మదనపల్లె నుంచి రాజకీయ జీవితం ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇక్కడి వైద్య కళాశాలను ప్రభుత్వపరంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో దోషిగా మిగిలిపోతారన్నారు. మదనపల్లె సమస్యలను పరిష్కరించాలని ప్రతిపక్ష నాయకునిగా ఆందోళన చేసిన ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా..వైద్య కళాశాల విషయంలో మాతో కలిసి పోరాటం చేస్తారో, పదవికి రాజీనామా చేస్తారో తేల్చుకోవాలని నిలదీశారు. వైద్య కళాశాలను ప్రయివేటుకు అప్పగిస్తుంటే ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ఏం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైద్య కళాశాలలకు లాభాలు లేనప్పుడు హెరిటేజ్ కంపెనీకి అధిక లాభాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. సంపద సృష్టిస్తానని ప్రజలను నమ్మించి అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రజల సంపదను ప్రైవేట్‌వారి చేతుల్లో పెడుతున్నారని అన్నారు బీఎస్పీ నాయకులు సహదేవ, చంద్ర, బాలాజీ, మహేష్, ప్రశాంత్, శివ, అనిల్, రెడ్డెప్ప, వేణు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో మందుబాబుల వీరంగం

- చిల్లర దుకాణంపై పెట్రోల్‌తో దాడి
- చిల్లర బాకీ అడిగినందుకు ఘాతుకానికి దిగిన మందుబాబులు



చిల్లర దుకాణంలో చెలరేగిన మంటలు

ఒంటిమిట్ట : బాకీ అడిగాడని చిల్లర దుకాణంపై మందుబాబులు పెట్రోల్ పోసి దాడి చేశారు. బాధితుల వివరాల మేరకు..చిన్న కొత్తపల్లికి చెందిన కట్టా మల్లికార్జున అనే వ్యక్తి ఒంటిమిట్టలోని కల్యాణ్ రామ్ టౌన్‌షిప్ వద్ద ఉన్న పట్నం పెంచలయ్య చిల్లర దుకాణంలో చిల్లర బాకీ చేసి ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 2:50 గంటలకు కట్టా మల్లికార్జున పెంచలయ్య చిల్లర దుకాణానికి వచ్చాడు. మల్లికార్జున రావడంతో దుకాణాదారుడు పెంచలయ్య తనకు బాకీ ఉన్న చిల్లర తిరిగి ఇవ్వాలని అడిగాడు. ఎంత ఉందని మల్లికార్జున పెంచలయ్యను ప్రశ్నించాడు. రూ. 170 బాకీ ఉందని చెప్పగా నువ్వు రూ. 100 అబద్ధం చెబుతున్నావు. నేను బాకీ రూ.70 మాత్రమే ఉన్నానని దుకాణాదారుడు పెంచలయ్యపై మద్యం మత్తులో ఉన్న కట్టా మల్లికార్జున దాడి చేశాడు. దీంతో దెబ్బలు తిన్న దుకాణాదారుడు స్థానిక పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలుసుకున్న మద్యం మత్తులో ఉన్న కట్టా మల్లికార్జున ఆగ్రహావేశంతో కట్టా బాలకృష్ణా అనే వ్యక్తితో కలిసి సాయంత్రం 4:50 గంటలకు వచ్చి, పెట్రోల్ పోసిన ప్యాకెట్లను పెంచలయ్య దుకాణంపై విసిరి, దుకాణానికి నిప్పుపెట్టి పారిపోయారు. వెంటనే స్పందించిన దుకాణాదారులు, స్థానికులు మంటల్లో కాలిపోతున్న దుకాణంపై నీరు పోసి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో బాధితుడు పెంచలయ్య దుకాణంలో రూ. 45 వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. తనకున్న బాకీ అడిగినందుకు తనకున్న జీవనాదారమైన దుకాణంపై దాడిచేయడం అమానుషమని, ఇంతటి దౌర్జన్యం, రౌడియిజం ఎన్నడు లేదని దుకాణదారుడు కన్నీటి పర్యంతం అయ్యాడు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన మందుబాబులను కఠినంగా శిక్షించాలని బాధిత దుకాణాదారుడు పోలీసులను ఆశ్రయించి, పిర్యాదు చేశానన్నాడు. ఒంటిమిట్ట పోలీసులు దాడికి గురైన దుకాణం వద్దకు చేరుకుని, దాడి జరిగిన ప్రదేశాన్ని, సీసీ కెమరాలో దాడికి సంబంధించి విడియోను పరిశీలించారు.

లైసెన్స్ ముగిసినా..

యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కమలాపురం పట్టణం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పునీత్ బార్‌కు నిబంధనలు వర్తించవా? అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత నెల 31వ తేదీకి పునీత్ బార్‌కు సంబంధించిన లైసెన్స్ గడువు ముగిసింది. అయినప్పటికి శుక్రవారం బార్‌ను తెరిచి సిబ్బంది యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిపారు. రాజకీయ నాయకుల అండదండలతో బార్‌లోనూ, బార్ చుట్టూ విక్రయాలు జరిపారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాలతో డీటీఎఫ్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నీలకంఠారెడ్డి, ఎర్రగుంట్ల ఎక్సైజ్ సీఐ గోపీనాథ్‌లు కలసి బార్‌పై శుక్రవారం మధ్యాహ్నం దాడులు జరిపారు. అధికారుల తనిఖీలో లైసెన్స్ లేకుండానే మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు తేలడంతో బార్‌ను మూసి వేశారు. బార్‌లో ఉన్న మద్యంను తీసుకెళ్లకుండా స్థానిక కూటమి నాయకుల అనుచరులు ఒత్తిడి చేశారు. బార్‌ల లైసెన్స్‌లు పొందడానికి కూటమి ప్రభుత్వం గడువు పెంచినప్పటికి టెండర్ వేయకుండా ఇలా బరితెగించి అక్రమంగా మద్యం విక్రయించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకుల చేష్టలతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బార్‌ల లైసెన్స్‌కు టెండర్లు వేయడానికి టెండర్‌దారులు సిద్ధంగా ఉన్నప్పటికి వేయకుండా రాజకీయ నాయకులు అడ్డుకోవడం ఎంత వరకు సబబు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. బార్ చుట్టూ అక్రమంగా మద్యం విక్రయిస్తే టెండర్లు వేయడానికి ఏదీ ఏమైనప్పటికి మద్యం అక్రమంగా విక్రయిస్తున్న పునీత్ బార్‌ను శాశ్వతం మూసి వేయాలని ప్రజలు కోరుతున్నారు. లైసెన్స్ ఉన్న మద్యం షాపు ఎదుటే లైసెన్స్ లేకుండానే మద్యం విక్రయిస్తుంటే ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రం అంతా నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరుపుతుంటే కమలాపురంలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరపడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించి పునీత్ బార్ చుట్టూ మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



అరెస్టును చూపుతున్న అర్బన్ సీఐ నాగార్జున

రాజంపేట : పట్టణంలోని వెంకటపల్లెరోడ్డులోని భవానీ నగర్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ నాగార్జున మాట్లాడుతూ జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో రాజంపేట ఏఎస్పీ ఆదేశాల మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.15120 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రజలు అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలని, వారు పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. సమాచారాన్ని 9121100569(సీఐ), 9121100570 (ఎస్ఐ) నంబర్లకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరోగ్యమాత ఉత్సవాలు



మరియమాత సందేశాన్ని తెలియజేస్తున్న గురువులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆరోగ్యమాత తిరునాల మహోత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రార్థనల్లో భాగంగా తొలుత జపమాల, పాటలను ఆలపించారు. ఆరోగ్యమాత స్వరూపాన్ని అలంకరించి పల్లకీలో ఊరేగించారు. గుంటూరుకు చెందిన రెవరెండ్ ఫాదర్ దేవ దివ్య సత్ప్రసాద ఆరాధన, ప్రార్థనలు నిర్వహించారు. గుంటూరు ఎస్‌జీజేకు చెందిన రెవరెండ్ ఫాదర్ ఆకుల ధర్మరాజు దివ్య బలిపూజ నిర్వహించి భక్తుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం గురువులు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ మరియమాత జన్మదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని తెలిపారు. ఆ తల్లి ప్రేమ తరిగిపోనిదన్నారు. రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ గురువులు, కన్య స్త్రీలు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు